క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాలు పరిశీలన



పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న తహసీల్దార్

పెగడపల్లి: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో భాగంగా మండల అధికారులు ఎన్నికలు ఏర్పాట్లకు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా పెగడపల్లి మండలంలోని నామాపూర్, ఏడుమోటలపల్లి, పెగడపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ కృష్ణచైతన్య సోమవారం సందర్శించారు. కరెంట్ సౌకర్యం, ర్యాంపులు, మూత్రశాలలు, ఇతరాత్ర వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్, నామాపూర్ సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ ఓటింగ్‌పై ప్రజలను చైతన్యపర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్

మెట్‌పల్లి: స్వచ్ఛ సర్వేక్షణ్ ఓటింగ్‌లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనేలా చూడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత సూచించారు. మున్సిపల్ సమావేశ మందిరంలో సోమవారం సిబ్బంది, ఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఓటింగ్‌లో అవగాహన లేకపోవడం వల్ల ప్రజలు పాల్గొనడం లేదన్నారు. వార్డుల్లో దీనిపై విస్తృతంగా ప్రచారం నిర్వహించి ప్రజలు ఓటింగ్‌లో పాల్గొనేలా చొరవ తీసుకోవాలన్నారు. అత్యధిక సంఖ్యలో ఓటింగ్‌లో మున్సిపాలిటీని జిల్లాలో ముందంజలో ఉంచాలన్నారు. సమావేశంలో కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, వైస్‌చైర్మన్ చంద్రశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ సభ్యత్వ నమోదు



సభ్యత్వం తీసుకుంటున్న ఉపాధ్యాయులు

మల్యాల: మండలంలోని మల్యాల,రాజారం, పోతారం, రామన్నపేట, తాటిపల్లి, రాంపూర్, ఒబులాపూర్ ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం పీఆర్టీయూ టీఎస్ నాయకులు సోమవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. పీఆర్టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయినపల్లి ఆనందరావు, సభ్యులు పాఠశాలలకు తిరిగి, సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు సరేందర్, మండల అధ్యక్షుడు రత్నాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి ముదుగంటి విష్ణువర్ధన్‌రెడ్డి, రఘునందర్‌రావు, నరేందర్, కిశోర్ పాల్గొన్నారు.

మహిళలు హక్కుల గురించి తెలుసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న కో-ఆర్డినేటర్లు

జగిత్యాల: మహిళలు వారి హక్కుల గురించి తెలుసుకోవాలని డిస్ట్రిక్ట్ మిషన్ కో-ఆర్డినేటర్ అశ్విని అన్నారు. జగిత్యాలలోని ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల, సాంఘీక గురుకుల కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఆర్థికాభివృద్ధి, స్కిల్ డెవలప్‌మెంట్ ఎలా సాధించాలో వివరించారు. వారికి సంబంధించిన టోల్‌ఫ్రీ నంబరు గురించి తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీం సభ్యులు నరేశ్, గౌతమి, యమశ్రీ పాల్గొన్నారు.

శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠ

కథలాపూర్: మండలంలోని కలిగోటలో శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠ సోమవారం ఉదయం నిర్వహించారు. గిరిజనులు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలకు హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ధరావత్ సరోజ, ఎంపీటీసీ దేవేంద్ర, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, కాంగ్రెస్ నాయకుడు ఆది శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు గోలి మోహన్, ఏనుగు మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో పేరుకుపోయిన చెత్త



వెల్లటూర్‌లో రోడ్డుపై పేరుకుపోయిన చెత్తాచెదారం

వెల్లటూర్: పంచాయతీ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె వల్ల గ్రామాల్లో చెత్త కుప్పలు కుప్పలుగా పేరుకు పోయింది. మండల కేంద్రంలోని వ్యాపార సముదాయాల ముందు చెత్త విపరీతంగా పేరుకుపోయింది. మండల కేంద్రంలో పామును చంపి చెత్తకుప్పలో పడేశారు. అయినా అధికారులు మాత్రం పట్టించుకున్న పాపాన పోవడం లేదు. అసలే వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. కార్మికులు సమ్మెలో ఉండడంతో గ్రామాల్లో చెత్త సేకరించేవారు లేకపోవడంతో కుప్పలుగా పేరుకుపోయింది. తాత్కాలిక సిబ్బందిని నియమించి చెత్త సేకరణ చేయాల్సిన పాలకవర్గాలు, అధికారులు పట్టించుకోకపోవడంతో రోడ్లపై చెత్త అలాగే ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఇప్పటికైనా అధికారులు, పాలకవర్గాలు స్పందించి ప్రజలు రోగాల బారిన పడకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులు పండ్ల తోటలు సాగు చేయాలి

ఇబ్రహీంపట్నం: రైతులు పండ్ల తోటలు సాగు చేసేందుకు ముందుకు రావాలని మండల వ్యవసాయ అధికారి దీపిక కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులకు పండ్ల తోటల పెంపకంపై అవగాహన కల్పించారు. 5 ఎకరాలలోపు భూమి ఉన్న రైతు మామిడి, బత్తాయి, నిమ్మ, జామ, సపోట, సీతాఫలం మొదలైన రకాల పండ్ల తోటలను పెంచేందుకు ముందుకు వస్తే సబ్సిడీడిపై మొక్కలను ఇచ్చి ఉపాధి హామీలో గుంతలను తీయించి మొక్కలను నాటిస్తామని 3 ఏళ్ల పాటు మొక్కలకు ఎరువులను కూడ సబ్సిడీపై ఇస్తున్నట్లు తెలిపారు. డ్రాగన్ ఫ్రూట్స్ పండ్ల తోటలను పెంచేందుకు 20 గుంటల భూమిలో మొక్కలు నాటేందుకు రూ. 2 లక్షలు సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, ఎంపీవో కృపాకర్, ఏపీఎం శంకర్, ఏపీవో వినోద్, ఏఈవోల నరేశ్, శ్యామ్, రవళిక, సర్పంచులు, పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం

మల్లాపూర్: పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఎంపీపీ కాటిపెల్లి సరోజన అన్నారు. సోమవారం మల్లాపూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సమతుల్య ఆహారం లభించక పౌష్టికాహార లోపంతో వివిధ రకాల వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. సమతుల్య ఆహారంలో విటమిన్లు, ఖనిజ పోషకాలు కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. అన్నిరకాల విటమిన్లు, ఖనిజ పోషకాలు ప్రకృతిలో పండ్లు, కూరగాయల నుంచి లభిస్తాయన్నారు. రైతులను పండ్ల తోటల పెంపకానికి సబ్సిడీ అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఓవ లావణ్య, ఈజీఎస్ ఏపీవో సతీశ్, ఐకేపీ ఏపీఎం లక్ష్మణ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఏఈవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకానికి అవకాశం

సారంగాపూర్: పండ్లతోటలు పెంచుకోవడానికి ఎస్సీ, ఎస్టీ రైతులతో పాటు ఐదెకరాల లోపు ఉన్న సన్నకారు, చిన్నకారు రైతులకు అవకాశం ఉందని ఎంపీడీవో రాజేందర్ అన్నారు. సోమవారం మండలంలోని రేచపల్లిలో సర్పంచ్ ఎడమల జయ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పండ్లతోటలు పెంచుకోవడానికి రైతులకు ఇచ్చే రాయితీలతో పాటు, ఏఏ మొక్కలుపెంచుకోవాలన్న దానిపై ఎంపీడీవో గ్రామస్తులకు వివరించారు. ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఉపసర్పంచ్ రాచకొండ రాజేశం, వార్డు సభ్యుడు బేర మహేష్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఏవో దీపిక, ఎంపీపీ

మహిళల ఆదాయాభివృద్ధికి ప్రభుత్వం చేయూత

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: రాష్ట్రంలో మహిళల ఆదాయాభివృద్ధికి ప్రభుత్వం చేయూతనందిస్తోందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్‌లో శ్యామల గ్రామీణ మహిళా స్వశక్తి సంఘం, ధనలక్ష్మీ సహజ ఉత్పత్తుల ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను సోమవారం ప్రారంభించి మాట్లాడారు. మహిళా సంఘ సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం పావలా వడ్డీ రుణాలతో పాటు, స్త్రీనిధి రుణాలు అందిస్తూ మహిళ సంఘ సభ్యుల ఆదాయాభివృద్ధి పెంచేందుకు ప్రోత్సహిస్తోందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది కుటుంబానికి అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల రైతుబంధు కన్వీనర్ నక్కల రవీందర్‌రెడ్డి, సర్పంచ్ మమత, ఎంపీటీసీ స్వప్న, ఆత్మ చైర్మన్ రాజిరెడ్డి, ఏపీడీ సుదీర్, ఎంపీడీవో రాజేశ్వరి, ఏపీఎం గంగాధర్ పాల్గొన్నారు.



ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ వద్ద మహిళలతో ఎమ్మెల్యే

చెక్కులు పంపిణీ

జగిత్యాల రూరల్ మండలానికి చెందిన 58 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.16.78 లక్షల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను వారికి అందజేశారు. కార్యక్రమంలో రైతుబంధు మండల కన్వీనర్ నక్కల రవీందర్‌రెడ్డి, నాయకులు నారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే అధికారం

- కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

కోరుట్ల రూరల్: రాష్ట్రంలో మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీదే అధికారమని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. మండలంలోని అయిలాపూర్ రైతు వేదికలో సోమవారం రైతు సదస్సులో పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. ఉచిత విద్యుత్‌పై రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వాఖ్యలను ఎమ్మెల్యే ప్రస్తావిస్తూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మూడు గంటలు కూడా ఉచిత విద్యుత్ ఇవ్వలేరన్నారు. రైతులకు ఉచితంగా 24 గంటలు విద్యుత్ ఇస్తున్న రాష్ట్రం దేశంలో తెలంగాణ ఒక్కటేనన్నారు. అధికారంలోకి వస్తామని అంటున్న కాంగ్రెస్, బీజేపీ లవి పగటికలలు మాత్రమేనని, మళ్లీ అధికారం బీఆర్‌ఎస్‌దేనన్నారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, ఎంపీపీ తోట నారాయణ, జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, సర్పంచుల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, సర్పంచులు పిడుగు రాధ, అంజయ్య, ఇప్పమంగ, ఎంపీటీసీలు గుగ్గిళ్ల ప్రియాంక, చిట్నేని లత, నాగిరెడ్డి సుభాశ్ రెడ్డి, గంగాధర్, సింగిల్‌విండో చైర్మన్ చింతకుంట సాయి రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

రోళ్లవాగు ప్రాజెక్టు తూములకు షటర్లు బిగించాలి

సారంగాపూర్: రోళ్లవాగు ప్రాజెక్టు తూములకు వెంటనే షటర్లు బిగించాలని జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాషాకు బీర్‌పూర్ ఎంపీపీ మసర్తి రమేశ్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ప్రాజెక్టును 0.25 టీఎంసీ నీటి నిలువ సామర్థ్యం నుండి 1 టీఎంసీ నిలువ చేయడానికి ప్రభుత్వం రూ. 63 కోట్లతో ప్రారంభించిన పనులు ప్రస్తుతం ఇది రూ. 135 కోట్లకు చేరందని, దాదాపు ఆరేళ్లు కావస్తున్నా ప్రాజెక్టు పూర్తికాలేదన్నారు. ప్రాజెక్టుకు దిగువకు నీటిని విడుదల చేయడానికి ఏర్పాటు చేసిన మూడు తూములకు ఇప్పటికీ షటర్లు బిగించకపోవడంతో వర్షాలకు వస్తున్న నీరు బయటకు వెళ్లిపోతుందని, దీంతో రైతులు పంటలకు నీరు అందక నష్టపోయే పరిస్థితి ఉందని, వెంటనే షటర్లు బిగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, నాయకులు చెర్పూరి సుభాశ్, బర్రె రాజన్న తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న ఎంపీపీ, ప్రజాప్రతినిధులు

27న విశ్వరూప సన్నాహక సభ

మల్యాల: మాదిగల విశ్వరూప సన్నాహక సభకు మాదిగ, మాదిగ ఉపకులాలు వేలాదిగా తరలిరావాలని ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ నలువాల సంజీవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ మాదిగ విశ్వరూప సన్నాహక సభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ నెల 27న జగిత్యాలలో జరగనున్న సభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ దూమాల గంగారాం, కో కన్వీనర్ బెజ్జంకి సతీశ్, ఎమ్మార్పీఎస్ కోకన్వీనర్ ముప్పారపు రవీందర్, పాల్గొన్నారు.

సారంగాపూర్: ఈ నెల 27న జగిత్యాలలో జరిగే మాదిగల సన్నాహక సదస్సుకు మాదిగలు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని పోతారం, బట్టపల్లి గ్రామాల్లో సన్నాహక సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మీసాల చంద్రయ్య, సీపెల్లి ముత్తయ్య, సీపెల్లి లచ్చయ్య పాల్గొన్నారు.

పెగడపల్లి: ఈనెల 27న జగిత్యాలలో నిర్వహించే మాదిగ విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ ధర్మపురి నియోజకవర్గం ఇన్‌చార్జి దీకొండ మహేందర్ అన్నారు. పెగడపల్లి మండల కేంద్రంలో సోమవారం సంబంధిత కరపత్రాలను నాయకులతో కలిసి ఆవిష్కరించారు.

చాత్తాన శ్రీవైష్ణవ సంఘం అధ్యక్షుడిగా తులసీ కృష్ణ



తులసీ కృష్ణ

కోరుట్ల: పట్టణంలోని చాత్తాన శ్రీవైష్ణవ సంఘం ఎన్నికలు సోమవారం జరిగాయి. అధ్యక్షుడిగా తులసి కృష్ణ, కార్యదర్శిగా చింత కిషోర్, కోశాధికారిగా రాసూరి అశ్విన్, గౌరవ అధ్యక్షుడిగా టి.వెంకట్నర్సయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రమణ, వేణుగోపాల్, అనిత, ప్రభావతి, బాదాం రమణ, కిష్టయ్య పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా పాండురంగ

మెట్‌పల్లి: బీసీ సంక్షేమ సంఘం నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన అల్లె పాండురంగను నియమిస్తూ రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్లమెంట్ పరిధిలో బీసీల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

జగిత్యాలక్రైం: ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, మద్యంతాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఇన్‌స్పెక్టర్ రఫీక్‌ఖాన్ అన్నారు. సోమవారం జిల్లా ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడి, ట్రాఫిక్ నిబంధనలు పాటించని 26 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ... వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపవద్దన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రత్యేక తనిఖీలు చేపడుతూ ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్సై కృష్ణ, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

జగిత్యాల: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజినీకాంత్ అన్నారు. సోమవారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు లేవని, విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఖాళీగా ఉన్న ఎంఈవో పోస్టులను ప్రభుత్వం తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డీఈవో ఎప్పటికప్పుడు ప్రభుత్వ పాఠశాలలను పర్యవేక్షిస్తూ సమస్యలను పరిష్కరించాలన్నారు. విద్యార్థులకు బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గరల్స్ కన్వీనర్ మనీష, వినోద్, రమేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల వినూత్న నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న జీపీ కార్మికులు

మల్యాల: తమ సమస్యల పరిష్కారానికి పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె 14 వరోజుకు చేరుకుంది. సమ్మె చేస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంపై సోమవారం మల్యాలలో పారిశుధ్య కార్మికులు అరగుండు, అర మీసం తీసుకుని నిరసన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చేదాకా పోరాటం చేస్తామన్నారు.

ఉరితాళ్లతో పంచాయతీ కార్మికుల నిరసన

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో పంచాయతీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. సోమవారం సారంగాపూర్ మండల పరిషత్ కార్యాలయం ముందు పంచాయతీ కార్మికులు ఉరితాళ్లు మెడకు వేసుకుని ప్రభుత్వానికి నిరసన తెలిపారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



ధర్మపురిలో కేక్ కట్ చేస్తున్న డీసీఎంఎస్ చైర్మన్



మల్యాలలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలు సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జగిత్యాల జిల్లా కేంద్రం, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గ కేంద్రాలు, మెట్‌పల్లి, రాయికల్ పట్టణాలు, అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో కేక్‌లు కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. పలు ఆలయాల్లో కేటీఆర్ పేరిట ప్రత్యేక పూజలు చేశారు. జన్మదినం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. పలు చోట్ల మొక్కలు నాటారు, రక్తదానం చేశారు. విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఉపాధికూలీలకు హాట్ బాక్స్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్లు, జెడ్పీటీసీలు,ఎంపీపీలు, కౌన్సిలర్లు, సర్పంచులు,ఎంపీటీసీలు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- సాక్షి,నెట్‌వర్క్

సీఎం చిత్రపటానికి దివ్యాంగుల క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన దివ్యాంగులు

ఇబ్రహీంపట్నం: దివ్యాంగులకు సీఎం కేసీఆర్ ఆసరా పింఛన్ రూ. 4,016 కు పెంచడంతో మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద దివ్యాంగుల సంఘం జిల్లా ఉపాధ్యాక్షుడు గుమ్మడి లక్ష్మీ నర్సయ్య గౌడ్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు నెరేళ్ల శ్రీనివాస్, మరిశెట్టి రాజు, గుండ రాజేశ్వర్, రాజలింగం, మల్లయ్య, దేవయ్య, ఎంపీపీ జాజాల భీమేశ్వరి, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్: ప్రభుత్వం దివ్యాంగులకు రూ. 1000 పింఛన్ పెంచడంపై సోమవారం బీర్‌పూర్ మండలంలోని దివ్యాంగులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మా పరిస్థితి గుర్తించిన ముఖ్యమంత్రి కేసీఆర్ పింఛన్ రూ. 3016 నుంచి రూ. 4016కు పెంచడం సంతోషంగా ఉందని, సీఎంకు రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

వీఆర్‌ఏల క్షీరాభిషేకం

మల్యాల: వీఆర్‌ఏలను రెగ్యులరైజ్ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం మల్యాల మండల కేంద్రంలో సీఎం కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అర్హతల ఆధారంగా పేస్కేలు పెంచి, రూ. 23 వేల వీఆర్‌ఏల కుటుంబాల్లో సీఎం కేసీఆర్ వెలుగులు నింపారని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు ఎండీ.సాజిద్, సల్మాన్, అజ్జు, నర్సయ్య, సాయి, సునీత పాల్గొన్నారు.

మల్లాపూర్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి వీఆర్‌ఏలు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షుడు షేక్ రఫీ హైమద్ మాట్లాడుతు వీఆర్‌ఏలకు పే స్కేల్ వర్తింపజేస్తూ జీవో విడుదల చేయించిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం ఉపాధ్యక్షుడు తోగారి రాజేందర్, గౌరవ అధ్యక్షుడు రమెల్ల రాజకిషన్, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌లో ప్రతిభ

కోరుట్ల: పట్టణానికి చెందిన మై ఫిట్ క్లబ్ జిమ్ యువకులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటారు. హైదరాబాద్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఠాకూర్ ప్రవీణ్ సింగ్, బొలిసేటి మణిదీప్, గోరుసోమి చైతన్య జూనియర్ కేటగిరిలో ప్రతిభ చాటి గోల్డ్, సిల్వర్ మెడల్ సాధించారు. వీరిని జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఉరుమడ్ల చరణ్, తదితరులు అభినందించారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

సారంగాపూర్: ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఉమ్మడి మండల ఆర్యవైశ్యులు సోమవారం సారంగాపూర్ తహసీల్దార్ రవీందర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఇతర కులాలకు ఇచ్చినట్లు ప్రతీ పేద ఆర్యవైశ్య కుటుంబానికి రూ. 1 లక్ష చొప్పున ఆర్థికసాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మర్యాల రాజన్న, యాసాల మల్లిఖార్జున్, గంప శ్రీనివాస్, గంప కిషన్, యాసాల మనోహర్, ఎర్ర మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై కేజీవీల్స్ తిప్పితే చర్యలు

ఇబ్రహీంపట్నం: రోడ్లపై ఎవరైనా కేజీవీల్ ట్రాక్టర్లు నడిపిస్తే రూ. 5 వేలు జరిమానా విధిస్తామని ఎర్దండి గ్రామపంచాయతీ పాలకవర్గం తీర్మానించింది. ఇటీవల ఇబ్రహీంపట్నం నుంచి కొజన్‌కొత్తూర్, ఎర్దండి మీదుగా మూలరాంపూర్ వరకు ఉన్న ఆర్ అండ్‌బీ డబుల్‌రోడ్ రూ. 1 కోటి 25 లక్షలతో రెన్యూవల్ బీటీ రోడ్డును చేశారు. కేజీవీల్స్ ట్రాక్టర్లు నడిస్తే రోడ్డు చెడిపోతుందని, ట్రాక్టర్లు పట్టీలు అమర్చుకుని వెళ్లాలని కోరారు. గ్రామాల్లోని సీసీ రోడ్లపై కూడా కేజీవీల్స్ ట్రాక్టర్లు తింపవద్దని రైతులకు సూచించారు.

రైతుబంధు నిధులను విడుదల చేయాలి

మెట్‌పల్లి: వానాకాలం సీజన్‌కు సంబంధించిన రైతుబంధు నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కాంగ్రెస్ నాయకుడు కొమొరెడ్డి కరం డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం మాట్లాడారు. సీజన్ ప్రారంభానికి ముందే రైతుల ఖాతాల్లో సొమ్మును జమ చేయాల్సిన ప్రభుత్వం ప్రతీ సారి జాప్యం చేస్తోందన్నారు. పంటల పెట్టుబడి కోసం అందించే నిధుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహారించడం తగదన్నారు. ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రొల హన్మాండ్లు, సురభి అశోక్, పొట్ట రాజేశ్వర్, పెంట ప్రణయ్, పాల్గొన్నారు.

బీఎల్‌వోలకు శిక్షణ

జగిత్యాలరూరల్: ఎన్నికల అధికారులు ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేలా శిక్షణ తీసుకోవాలని తహసీల్దార్ ఖయ్యూం అన్నారు. రాయికల్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం బూత్ అధికారులకు శిక్షణఇచ్చారు.

వెల్లటూర్: రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఎన్నికల దృష్ట్యా ఎంపీడీవో కార్యాలయంలో ఉమ్మడి వెలటూర్ మండల బీఎల్‌వోలకు సోమవారం శిక్షణ ఏర్పాటు చేశారు. తహసీల్దార్లు రమేశ్, ఉదయ్‌కుమార్, ఉమ్మడి మండల బీఎల్‌వోలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మూగజీవాలు మృతి

గొల్లపల్లి: మండలంలోని రాపల్లి గ్రామానికి కల్లు భూమయ్యకు చెందిన పాడి ఆవు విద్యుదాఘాతంతో మృతి చెందిందని బాధితుడు విలపించాడు. సోమవారం మేతకు వెళ్లిన ఆవు మేత మేస్తు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలిం విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృత్యువాత పడింది. రూ. 60 వేల విలువగల పాడి ఆవు మృతిచెందిందని, ప్రభుత్వం ఆదుకోవాలి కోరాడు.

సారంగాపూర్: మండలంలోని కోనాపూర్‌లో సోమవారం విద్యుత్ షాక్‌తో గ్రామానికి చెందిన పిన్నం శంకర్ అనే రైతుకు చెందిన గేదె మృతిచెందింది. గ్రామపంచాయతీ ఆవరణలో ఉన్న బోరు బావి మోటారు వద్దకు మేతకు వెళ్లిన గేదె విద్యుత్ షాక్‌కు గురై గేదె అక్కడికక్కడే మృతిచెందింది. గేదె విలువ రూ. 60 వేల వరకు ఉంటుందని రైతు పేర్కొన్నాడు. సంఘటన స్థలాన్ని ఎంపీపీ కోల జమున, సర్పంచ్ ఆకుల జమున, ట్రాన్స్‌కో ఏఈ సతీశ్ సందర్శించి, ప్రభుత్వ పరంగా ఆదుకుంటామన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

బుగ్గారం: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు గుర్తించి సోమవారం బాధితుడికి అందించినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన చుక్క శంకరయ్య ఇటీవల తన మొబైల్‌ను పోగొట్టుకున్నాడు. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌తో సెల్‌ఫోన్‌ను వెతికి పట్టుకుని శంకరయ్యకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

వర్షానికి కూలిన ఇల్లు

కథలాపూర్: మండలంలోని బొమ్మెనలో వర్షం తాకిడికి దొంగిసారం శ్రీనివాస్ అనే వ్యక్తికి చెందిన ఇల్లు సోమవారం కూలిందని గ్రామస్తులు తెలిపారు. వర్షం వల్ల శ్రీనివాస్ ఇంటి పైకప్పు కూలింది. సామగ్రి పాడైనట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.